సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 28 । జనవరి । 2025



నిరసనల హోరు...

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) సందర్భంగా కలెక్టరేట్ వద్ద నిరసనలతో హోరెత్తింది. 8లో



టూరిజంలో విస్తృత అవకాశాలు

పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఉమ్మడి విశాఖ జిల్లాలో విస్తృతమైన అవకాశాలున్నాయని అధికారులు స్పష్టం చేశారు. 8లో

నేడు డీజీపీ రాక

పరవాడ: రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం పరవాడ జేఎస్ ఫార్మాకు రానున్నారు. అనకాపల్లి జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన గంజాయిని ఆయన ఆధ్వర్యంలో ధ్వంసం చేయనున్నారు. రాంకీ కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ వద్ద డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 35 వేల కిలోల గంజాయి ధ్వంసం చేయనున్నారు.

న్యూస్‌రీల్

టి.సిరసపల్లి వీవోఏకు జాతీయ పురస్కారం



పురస్కారం అందుకున్న టి.సిరసపల్లి వీవోఏ ఉష

మునగపాక : మండలంలోని టి.సిరసపల్లికి చెందిన వీవోఏ పాలమరశెట్టి ఉష ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పురస్కారం అందుకున్నారు. సేంద్రియ వ్యవసాయంలో శిక్షణ పొంది మంచి ఫలితాలు సాధించిన నేపథ్యంలో ఉషకు గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఉషకు దక్కిన గౌరవం పట్ల సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడుతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ముస్లిం యాత్రికులకు టీకాలు



ముస్లిం యాత్రికులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

తుమ్మపాల: ఉమ్రా యాత్ర (మక్కా, మదినా) చేయు సందర్శనకు ఉపకరించే టీకాలు సోమవారం ముస్లిం యాత్రికులకు వేసినట్టు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్ దేవ్ అన్నారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా పట్టణంలో వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో టీకాల పంపిణీ జరిగిందన్నారు. 39 మందికి టీకాలు వేయగా వారిలో 60 ఏళ్ళు దాటిన ఏడుగురికి మెనింగో కొకల్ వ్యాక్సిన్‌తో పాటు ఇన్ ఏక్టివ్ ఫోలియో వ్యాక్సిన్ ఇంజక్షన్ రూపంలో ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు, సిరసపల్లి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కనిజాజ హీరా, నర్సింగ్ సిబ్బంది, పీఎస్ఎన్ హుస్సేన్, జిల్లా గణాంక అధికారి రామచంద్రరావు, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

బ్యాటరీతో నడిచే వీడర్ యంత్రం ఆవిష్కరణ



చెరకు తోటలో కలుపు తీస్తున్న నూతన యంత్రం

తుమ్మపాల : చెరకులో కలుపు నివారణకు అనకాపల్లి వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నూతన యాంత్రాన్ని తయారు చేశారు. శాస్త్రవేత్తలు, టీచర్ల సహాయంతో బ్యాటరీతో నడిచే వీడర్‌ను రూపొందించారు. సోమవారం వీడర్‌ను చెరకు తోటలో విజయవంతంగా ప్రయోగించారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో కలుపుతీసింది. ఒకసారి చార్జింగ్ చేసిన బ్యాటరీతో రెండు గంటల పాటు పనిచేస్తుంది. రోజుకు కనీసం రెండు ఎకరాల్లో కలుపు తీస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్త జి.కుసుమ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.నాగేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ అసిస్టెంట్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ సిహెచ్.ముఖుందరావు, ప్రదాన శాస్త్రవేత్తలు డాక్టర్ పివికె.జగన్నాదరావు, డి.ఆదిలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

కరాటే, తైక్వాండో శిక్షణ సంస్థలకు ఆహ్వానం

తుమ్మపాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు రాణీలక్ష్మీబాయి ఆత్మ రక్ష ప్రవీణ్ పథకం కింద కరాటే, తైక్వాండోలో శిక్షణ ఇవ్వనున్నట్లు సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ డాక్టర్ జయప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 126 ప్రభుత్వ, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6 నుంచి 8 తరగతుల్లో చదువుతున్న 2,215 మంది విద్యార్థినులకు, 266 జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, మున్సిపల్, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమ హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 6 నుంచి 9 తరగుతులు చదువుతున్న 27,469 మంది విద్యార్థినులకు ఈ పథకం కింద ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు 20 సెషన్స్‌లుగా శిక్షణ ఇస్తామన్నారు. ఇందు కోసం శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. యుద్ధ కళల్లో 2024 మార్చి 31 నుంచి కనీసం 3 ఏళ్ల నుంచి ఉనికిలో ఉండి విద్యార్థులకు శిక్షణ ఇచ్చే సంస్థలు ఈ నెల 29 లోగా ఏపీ సమగ్ర శిక్ష అనకాపల్లి, కొండకొప్పాక కార్యాలయంలో సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 30న ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి, 31న ఆర్డర్లు జారీ చేస్తామని ఆయన తెలిపారు.

త్రాసు... తిరకాసు

- తూకం, కొలతల్లో జనం జేబులకు చిల్లు
- కిలోకు 100 నుంచి 200 గ్రాముల వరకు తగ్గుదల
- డిజిటల్ వెయింగ్ మెషీన్‌లోనూ మోసాలు
- పండ్లు, కూరగాయలు, చేపలు, మాంసం దుకాణాల్లో చేతివాటం
- సూపర్ మార్కెట్లలోనూ తూకంలో తేడాలు
- అధికారులు తనిఖీలు తూతూ మంత్రం



యలమంచిలిలో ప్రధాన రహదారిపై కూరగాయల దుకాణం వద్ద ఉపయోగిస్తున్న తూకం





యలమంచిలి రూరల్ :

జిల్లాలోని మార్కెట్లలో తూకంలో మోసాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పండ్లు, మాంసం, చేపలు, కూరగాయలు, ఇతర సరుకులు అన్నింటా తూకం వేస్తే తేడా కనిపిస్తోంది. కళ్లముందే తూకంలో మోసం జరిగినా వినియోగదారులు గుర్తించని విధంగా వ్యాపారులు చాతుర్యం ప్రదర్శిస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో హడలిపోతున్న సామాన్యుల జేబులకు తూకంలో తేడాలు మరింత చిల్లు పెడుతున్నాయి. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు మార్కెట్లో వివిధ రకాల మోసాలకు తెరతీస్తున్నారు. తూకం, కొలతల్లో తేడాలు, నాణ్యతలేని సరుకులు, చిరునామా లేని ఆహార పదార్థాలు, చిరుతిండ్ల పొట్లాలు మార్కెట్లోకి విచ్చలవిడిగా తరలిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డిజిటల్ వెయింగ్ మెషీన్‌లోనూ...

డిజిటల్ వెయింగ్ మెషీన్‌లోనూ మోసం చేసే ఆస్కారముంది. మెషీన్‌లో క్యాలిబ్రేషన్ సెట్ చేయడం ద్వారా 1000 గ్రాములకు వారు అనుకున్నంత 900, 800 గ్రాముల వరకు సెట్ చేసుకోవచ్చు. ఇది ఒకసారి సెట్ చేస్తే అలానే ఉంటుంది. అదేవిధంగా ఎలక్ట్రానిక్ యంత్రాన్ని లీటర్ మోడ్‌లో పెట్టి తూకం వేస్తున్నారు. అందులో వెయ్యి గ్రాములు కాకుండా వెయ్యి అని మాత్రమే చూపిస్తోంది.

ప్యాకింగ్ నిబంధనలు బేఖాతరు

నిబంధనల ప్రకారం నిత్యావసర వస్తువులు ప్యాక్ చేసేందుకు తప్పనిసరిగా తూనికలు, కొలతల శాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా చాలా మంది వ్యాపారులు అనుమతి తీసుకోకుండానే కిరాణా సరుకులు ప్యాక్ చేస్తున్నారు. ఈ ప్యాకెట్లను తూకం వేయిస్తే తక్కువ బరువు చూపిస్తున్నాయి. బియ్యం వ్యాపారులు 25 కేజీల బస్తాల చొప్పున ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. కానీ ఇందులో 200 నుంచి 300 గ్రాములు తక్కువగా ఉంటోంది. ఇదంతా బహిరంగంగా జరుగుతున్న దందానే.

తక్కెడలు, తూకపు రాళ్ల లెక్కలు లేవు..

జిల్లా కేంద్రంలో తూనికలు, కొలతల శాఖ కార్యాలయం ఉంది. ఒక అసిస్టెంట్ కంట్రోలర్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. నెలలో ఒక్కసారైనా దుకాణాల్లో తనిఖీలు చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వ్యాపారులకు ఇష్టారాజ్యంగా మారింది. తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలకు వస్తున్నారన్న సమాచారం ముందుగా తెలిసి వ్యాపారులు పాత రాళ్లను దాచేస్తున్నారు. కొందరు వ్యాపారులు అధికారులను మేనేజ్ చేస్తూ తప్పించుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంత మంది చిరు, బడా వ్యాపారుల వద్ద ముద్రలు వేసిన ఎలక్ట్రానిక్ కాటాలు, ఇనుప తక్కెడలు, తూకాలు చేసే రాళ్లు ఉన్నాయనే లెక్కలు అధికారుల వద్ద లేకపోవడం కొసమెరుపు.

యలమంచిలి దిమిలి రోడ్డు కూడలి వద్ద ఉన్న ఒక కూరగాయల దుకాణంలో ఓ గృహిణి 500 గ్రాముల బంగాళ దుంపలు కొనుగోలు చేశారు. వాటిని ఎలక్ట్రానిక్ తూకం వేయిస్తే 450 గ్రాములు మాత్రమే ఉంది.

అడ్డరోడ్డు కూడలిలో ఇటీవల వెంకటరమణ అనే యువకుడు ఓ మాంసం దుకాణానికి వెళ్లి కిలో మటన్ తీసుకున్నాడు. ఇంటికి వచ్చాక అనుమానంతో దానిని మరో చోటుకి తీసుకెళ్లి తూకం వేయించగా.. 100 గ్రాములు తక్కువగా వచ్చింది. దీంతో వెళ్లి దుకాణదారును నిలదీయగా వంద గ్రాములు తిరిగి ఇచ్చాడు.

పలు దుకాణాల్లో బియ్యం బస్తా 26 కిలోలకు ధర చెల్లిస్తుండగా..తూకం వేస్తే 25.5 కిలోలు మాత్రమే ఉంటోంది. దీనిపై బియ్యం వ్యాపారులను నిలదీస్తే బుకాయిస్తున్నారు.

గతేడాది స్టాంపింగ్ చేయడం ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం :	రూ.61,80,649
విధించిన జరిమానాలు :	రూ.38,02,900
వ్యాపారులపై నమోదైన కేసులు:	562

ఇంకా పాతరకం త్రాసులే...



సీలు లేని తూకం రాయి

ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ అనేక మంది వ్యాపారులు ఇంకా పాత తరపు త్రాసులనే వాడుతున్నారు. మారుమూల గ్రామాల్లో కొందరైతే ఇప్పటికీ బండ రాళ్లను, టీ పొట్లాలను తూకం రాళ్లకు బదులుగా వినియోగిస్తుండడం గమనార్హం. నిబంధనల ప్రకారం ముద్రిత తూకం రాళ్లను వ్యాపారులు వాడాల్సి ఉంటుంది. మార్కెట్లో కొనుగోలు చేసిన కూరగాయలను బయట ఎలక్ట్రానిక్ కాటాపై తూకం వేయిస్తే 100 నుంచి 150 గ్రాముల వరకు తక్కువ వస్తోందని వినియోగదారులు అంటున్నారు. జిల్లాలో అనకాపల్లి, యలమంచిలి, చోడవరం, నర్సీపట్నం, పాయకరావుపేట, నక్కపల్లి, అడ్డరోడ్డు కూడలి, అచ్యుతాపురం, పరవాడ, కశింకోట, కె కోటపాడు, రావికమతం, రాంబిల్లి, రోలుగుంట, కోటఉరట్ల, చీడికాడ మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో పండ్లు, కూరగాయలు, మాంసం, కిరాణా దుకాణాల్లో ఇంకా పాతతరపు త్రాసులనే వాడుతున్నారు. చేపలను తూకం వేసే ముందు వాటిని లావుపాటి పాలిథిన్ కవర్లలో ఉంచి తూకం వేస్తున్నారు. కిలో చేపలు కొనుగోలు చేసి వాటిని బయట ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేయిస్తే 150 నుంచి 200 గ్రాముల వరకు తక్కువగా చూపిస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. మాంసం దుకాణాల్లోనూ 50 నుంచి 100 గ్రాముల వరకు తూకంలో మోసం చేస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. తూకం రాళ్లలో ఏ1 రకం (సరైన రాళ్లు), ఏ2 రకం (నాశిరకం రాళ్లు) ఉంటున్నాయి. వ్యాపారులు తూకం వేసేటపుడు ప్రశ్నించేవారు ఉన్నపుడు ఏ1 రకం రాళ్లు, మిగిలిన సమయాల్లో ఏ2 రకం రాళ్లు వినియోగిస్తున్నారు. కూరగాయల మార్కెట్ విక్రయదారుల్లో ఎక్కువ మంది వద్ద స్టాంపులు వేసిన తూకం రాళ్లు కనిపించవు.



యలమంచిలిలో ఓ దుకాణం వద్ద ఉపయోగిస్తున్న పాతకాలపు త్రాసు

ఫిర్యాదు ఎవరికి చేయాలంటే..

రామచంద్రయ్య, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ, అనకాపల్లి జిల్లా, ఫోన్. నెం. **93989 89565**, అనకాపల్లి, నర్సీపట్నం ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, అనూరాధ ఫోన్ నంబర్లు **93981 24303, 93981 32730**
టోల్ ఫ్రీ నెంబర్: **1967**

ఫిర్యాదు చేస్తే చర్యలు

తూనికలు, కొలతల శాఖకు సంబంధించి ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు ప్రతి వస్తువు కొనుగోలు చేసేటపుడు జాగరూకతతో ఉండాలి. ఘన, ద్రవ ఆహార పదార్థాలు ప్యాక్ చేసి విక్రయించేవారికి అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలి. ప్యాకింగ్ పూర్తి వివరాలను పరిశీలించాలి. బిల్లులు కచ్చితంగా అడిగి తీసుకోవాలి. పెట్రోల్, డీజిల్ పోయించుకునేటప్పుడు జీరో రీడింగ్ చూసుకోవాలి. ఎలక్ట్రానిక్ తూకంపై ప్రతి ఏటా ముద్ర వేస్తారు. ఉందా..లేదా పరిశీలించుకోవాలి.
–రామచంద్రయ్య, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ, అనకాపల్లి జిల్లా

గోవాడ సుగర్స్‌లో క్రషింగ్‌కు అంతరాయం

- 24గంటల తర్వాత తిరిగి ప్రారంభమైన క్రషింగ్
- బెగాస్ కొరతతో నిలిచిపోయిన బాయిలర్



ఫ్యాక్టరీ ఆవరణలో పెద్దసంఖ్యలో నిలిచిపోయిన చెరకు బళ్లు

చోడవరం : గోవాడ సుగర్స్ క్రషింగ్‌కు ఆదిలోనే అంతరాయం కలిగింది. బాయిలర్‌కు కావలసినంత బెగాస్ లేకపోవడంతో 24గంటల పాటు క్రషింగ్ నిలిచిపోయింది. తిరిగి సోమవారం సాయంత్రం క్రషింగ్ ప్రారంభమైంది. ఆర్థిక ఇబ్బందులు, కార్మికుల సమ్మెలతో ఈ ఏడాది క్రషింగ్ ప్రారంభించడమే ఆలస్యంగా జరిగింది. రోజువారీ క్రషింగ్ 2500 టన్నులకు జరుగుతుందని, అంతా బాగుందనే సమయంలో బెగాస్ కొరత ఏర్పడింది. గత సీజన్‌కు సంబంధించిన బెగాస్ కొంత ఉండడంతో క్రషింగ్, కో జనరేషన్ ఒకేసారి ప్రారంభించిన యాజమాన్యం అందుకు తగ్గట్టుగా కావలసినంత బెగాస్ సమకూర్చుకోకపోవడంతో రెగ్యులర్ క్రషింగ్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఫ్యాక్టరీకి గేటు, కాటాల నుంచి పెద్దసంఖ్యలో చెరకు సరఫరా అయిపోవడంతో ఫ్యాక్టరీ వద్ద రెండు యార్డులు చెరకు బళ్లతో నిలిచిపోయాయి. బాయిలర్ ఆగిపోవడం వల్ల క్రషింగ్ జరగక చెరకు బళ్లతో ఫ్యాక్టరీ ఆవరణ అంతా నిండిపోయింది. దూర ప్రాంతాల నుంచి ఎడ్లబళ్లు, ట్రాక్టర్లు, టిల్లర్లతో చెరకు తెచ్చిన రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వంట చెరకు, వరి ఊకను సమకూర్చి బాయిలర్‌కు అందించడంతో క్రషింగ్ తిరిగి ప్రారంభమైంది.

ఆదుకుంటామని చేతులెత్తేశారేం..!

- గోవాడ సుగర్స్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోరేం
- విలేకరుల సమావేశంలో అమర్‌నాథ్, ధర్మశ్రీ ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్,ధర్మశ్రీ

చోడవరం : కొత్త పరిశ్రమలు తెస్తామని చెప్పిన అధికార కూటమి నాయకులు అవి తేకపోగా ఉన్న పరిశ్రమలు మూసివేయించే పరిస్థితికి తెచ్చారని మాజీ మంత్రి, చోడవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు కరణం ధర్మశ్రీతో కలిసి అమర్‌నాథ్ విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ 24వేల మంది సభ్య రైతులు, 2వేల మంది కార్మికుల కుటుంబాలకు ఆధారమని, అటువంటి ఫ్యాక్టరీని అధికార కూటమి నాయకులు పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు. ఫ్యాక్టరీని అభివృద్ధి చేస్తామని, నియోజకవర్గంలో కొత్త పరిశ్రమలు తెస్తామని ఎంపీ సీఎం రమేష్, స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ఎంతో గొప్పలు చెప్పారన్నారు. ఇప్పుడు ఫ్యాక్టరీలో కార్మికులకు, రైతులకు బకాయిలు చెల్లించలేకపోవడం, ముడిసరుకు లేక క్రషింగ్‌కు ఇబ్బందులు తలెత్తినా ఎంపీ, ఎమ్మెల్యేలు ఏమీ పట్టనట్టు వదిలేశారన్నారు. రైతులు, కార్మికులు బకాయిలు చెల్లించడానికి రూ. 9 కోట్లు అవసరం కాగా రూ.6కోట్లు ట్రాన్స్‌కో, విశాఖ డెయిరీ నుంచి ఫ్యాక్టరీకి రావలసి ఉందని, మిగతా రూ.3 కోట్లు ప్రభుత్వం గ్రాంటుగా సాయం చేయాల్సి ఉందన్నారు. ఆ రూ.3 కోట్లు కూడా ముఖ్యమంత్రిని ఒప్పించి తెప్పించలేని పరిస్థితిలో ఎంపీ, ఎమ్మెల్యేలు ఉండడంతో ఇప్పుడు ఫ్యాక్టరీ దయనీయ పరిస్థితికి వచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు తాను పరిశ్రమల శాఖామంత్రిగా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించి రూ. 89.90 కోట్లు తెచ్చి ఫ్యాక్టరీని ఆదుకున్నామని అమర్‌నాథ్ చెప్పారు. తమ ఐదేళ్ల పాలనలో ఏటా సకాలంలో క్రషింగ్ చేసి రైతులకు, కార్మికులకు జీతాలు, చెరకు పేమెంట్స్ ఇచ్చామన్నారు. ఇప్పుడు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేకపోవడంతో ఈ ఏడాది క్రషింగ్ చాలా ఆలస్యంగా ప్రారంభించారని, బెగాస్ కావలిసినంత లేకపోవడంతో ఆదిలోనే క్రషింగ్‌కూడా అంతరాయం కలిగి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని మూసేసి ఎంపీ సీఎం రమేష్ సొంతం చేసుకుంటారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయని అమర్ అన్నారు. అదేగాని జరిగితే రైతుల తరపున ఉద్యమానికి దిగుతామన్నారు. వెంటనే ఆర్థిక సాయం చేసి ఫ్యాక్టరీని ఆదుకోవాలని అమర్, ధర్మశ్రీ డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు పాల్గొన్నారు.

ఊరూరా... బెల్ట్ జోరు..!

- జిల్లాలో అనధికారికంగా సుమారు 200 బెల్టు షాపులు
- హోంమంత్రి నియోజకవర్గంలోనే 40కు పైగా నిర్వహణ
- బెల్టు షాపులకు తరలిస్తున్న మద్యం లోడును పట్టుకున్న స్థానికులు
- బాటిల్‌పై రూ.20 అదనంగా అమ్మకాలు
- గ్రామాల్లో వేలం పాట ద్వారా రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించి ఏర్పాటు
- వీటిలో 30 శాతం సిండికేట్లకు, 20 శాతం ఎక్సైజ్ అధికారులకు కమీషన్లు
- మిగతా 50 శాతం గ్రామాలకు ఇస్తున్న వైనం



ఎస్.రాయవరం మండలం గుడివాడలో బెల్టు షాపులకు ఆటోలో తరలిస్తుండగా పట్టుబడిన మద్యం

'ఎస్.రాయవరం మండలంలో గుడివాడ గ్రామంలో ఉన్న మద్యం షాపు నుంచి బంగారమ్మపాలెం బెల్టు షాప్‌నకు భారీగా మద్యం ఆటోలో తరలిస్తుండగా స్థానికులు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్.రాయవరం ఎస్‌ఐ విభీషణరావు కేసు నమోదు చేశారు. స్థానిక టీడీపీ నాయకులు, హోంమంత్రి పీఏగా పనిచేసి సస్పెన్షన్ గురైన వ్యక్తి వాటాదారులుగా ఉన్న మద్యం షాపు నుంచి బెల్టు షాపులకు మద్యం తరలిస్తుండగా స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఇందులో రూ.3 లక్షల విలువైన 47 కేసుల మద్యం పైగా ఉన్నట్టు సమాచారం. అయితే 30 కేసులకు పైగా ఉంటే వెంటనే లైసెన్స్ రద్దు చేయాలనేది ఎక్సైజ్ పాలసీ విధానం. ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెంలో గల గ్రామ జాతర ఉండడంతో అధిక మొత్తంలో బెల్టు షాపులకు మద్యం తరలించినట్టు సమాచారం.'

సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీతో జిల్లాలో మద్యం ఏరులైపారుతోంది. గత అయిదేళ్లుగా మూతపడిన బెల్టు షాపులు మళ్లీ పల్లెల్లో విచ్చలవిడిగా తెరుచుకున్నాయి. స్థానిక కూటమి ప్రజాప్రతినిధుల అండతో సిండికేట్ వ్యాపారుల కనుసన్నల్లో బెల్టు షాపులు ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. లాటరీ ద్వారా మద్యం షాపులు దక్కించుకున్న సిండికేట్లు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా గుట్టుచప్పుడు కాకుండా అనధికారికంగా బెల్టుషాపులకు ఆజ్యం పోస్తున్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గంలో రూ.3 లక్షల నుంచి రూ.11 లక్షల వరకూ వేలం పాట ద్వారా బెల్టు షాపులు బహిరంగంగా ఏర్పాటు చేస్తున్నారు. మంత్రి అనుచరులే ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఇందులో సగం వాటా స్థానిక కూటమి ప్రజాప్రతినిధులకు, మిగిలిన వాటిలో మద్యం దుకాణదారులకు 30 శాతం, ఎక్సైజ్ శాఖ అధికారులకు 20 శాతం కమీషన్ ఇస్తున్నట్టు సమాచారం. జిల్లాలో పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్.రాయవరం, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి, సబ్బవరం వంటి ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా అనధికారికంగా బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని వేలం పాట ద్వారా డబ్బులు చెల్లించి అమ్మకాలు చేస్తుంటే..మరికొన్ని మద్యం సిండికేట్లే తమ అనుచరులు, బంధువుల ద్వారా అమ్మకాలు చేస్తున్నారు. ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకూ అదనంగా అమ్ముతున్నారు.

ఏరులై పారుతున్న మద్యం..

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల పరవాడ పర్యటనలో బెల్టు షాపులు పెట్టినవారి బెల్టు తీస్తానని బహిరంగంగా చెప్పినా..బెల్టు షాపులు వెలుస్తున్నాయంటే కూటమి ప్రభుత్వం వాగ్దానాలు అంతంత మాత్రమే అని జనం చర్చించుకుంటున్నారు. 2014 నుంచి 2019 మధ్య జిల్లాలో మద్యం విక్రయాలు ఇష్టానుసారంగా జరిగేవి. ఒక్కో వైన్‌షాప్ ఆధీనంలో 4 నుంచి 8 వరకు బెల్టుషాపులు నిర్వహించేవారు.

అనధికార వేలం.. లాభసాటి బేరం

- జిల్లాలో 136 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో గతంలో కంటే అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. బెల్టు షాపుల్లో ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 అదనంగా అమ్ముతున్నారు.
- చోడవరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 40 బెల్టు షాపులు ఉన్నట్టు సమాచారం. వీటిలో వేలం పాట ద్వారా ఏర్పాటు చేసినవి 10 నుంచి 15 ఉంటే..మిగిలినవి మద్యం దుకాణదారులు ఏర్పాటు చేసినట్టు సమాచారం.
- నర్సీపట్నం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 30 వరకూ బెల్టు షాపులు వెలిసినట్టు సమాచారం. వీటిలో వేలం పాట ద్వారా 10 వరకూ ఉంటాయి.
- పాయకరావుపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 30 నుంచి 35 వరకూ బెల్టు షాపులు వెలిచినట్టు సమాచారం. వీటిలో వేలం పాట ద్వారా 10 వరకూ ఉంటాయి.
- యలమంచిలి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 వరకూ బెల్టు షాపులు ఉన్నట్టు సమాచారం.
- అనకాపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్టు షాపులు లేవు. వేలం పాట ద్వారా అనధికారికంగా 20 వరకూ గ్రామాల్లో అధిక ధరలకు అమ్ముతున్నారు.

బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే వారిపై కఠిన చర్యలే..

జిల్లా వ్యాప్తంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. కాదని ఎవరైనా ఏర్పాటు చేస్తున్నట్టు మా దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. ఇప్పటివరకూ మా దృష్టికి బెల్టుషాపులు ఏర్పాటు చేసినట్టు రాలేదు. అంతేకాకుండా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మద్యం దుకాణదారులు అమ్మాలి. కాదని అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలుంటాయి.
– సుధీర్, జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి

క్లుప్తంగా

31న ధర్మశ్రీ ప్రమాణ స్వీకారం

అనకాపల్లి : కశింకోట మండలం తేగాడ గ్రామం సరోజిని విలాస్‌లో ఈ నెల 31న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడిగా మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఈవీఎం గోదాము తనిఖీ చేసిన డీఆర్వో



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న డీఆర్వో వై.సత్యనారాయణరావు

తుమ్మపాల : ఎస్పీ కార్యాలయం పక్కన ఉన్న ఈవీఎం గోదామును జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు సోమవారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసి అక్కడ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెక్షను సూపరింటెండెంట్ వాసు, డీటీలు రవి కుమార్, వి.రాజ్యలక్ష్మి, పట్టణ ఫైర్ అధికారి పి.నాగేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు టి.షణ్ముఖ, బి.శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు, టి.రమణ, కె.హరినాథబాబు పాల్గొన్నారు.

ఆరు బాక్సైట్ లారీల సీజ్



పోలీసులు సీజ్ చేసిన లారీలు

మాకవరపాలెం : పరిమితికి మంచి బాక్సైట్ ఖనిజం తరలిస్తున్న ఆరు లారీలను సీజ్ చేశామని ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. మండలంలోని జి.వెంకటాపురం సమీపంలో ఉన్న ఆన్‌రాక్ (ఫైనీర్) అల్యూమినియం రిఫైనరీకి నిత్యం అధిక సంఖ్యలో లారీలతో విశాఖ పోర్టు నుంచి బాక్సైట్ ఖనిజం తరలిస్తుంటారు. అయితే పరిమితికి మించి తిరుగుతున్న లారీల కారణంగా విశాఖ–నర్సీపట్నం ప్రధాన రహదారి అధ్వానంగా మారుతోంది. దీంతో అధిక లోడుతో వస్తున్న ఆరు లారీలను ఆదివారం రాత్రి నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు పట్టుకుని సీజ్ చేసినట్టు ఎస్ఐ సోమవారం తెలిపారు. సీజ్ చేసిన లారీలను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించామన్నారు.

ఆందోళనలతో దద్దరిల్లిన కలెక్టరేట్

పీజీఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ

నిరసనల హోరు.. నినాదాల జోరు



నిరాహార దీక్ష చేపడుతున్న వెలుగు వీవోఏలు

తుమ్మపాల: ఎన్నికల సమయంలో కూటమి నాయకుల బూటకపు హామీలతో మోసపోయిన ప్రజలతో పాటు పలువురు ఉద్యోగులు కూడా నిరసన బాట పట్టారు. అధికారం చేపట్టి 8 నెలలు గడుస్తున్నా ప్రజల సంక్షేమంపై గానీ, ఉద్యోగుల హామీలు అమలులో గానీ ప్రభుత్వం దృష్టి సారించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాలు, నిరసనల రూపంలో అన్ని వర్గాల ప్రజలు బయటకొస్తున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా పలు ఉద్యోగ సంఘాలు, ప్రజలు తమ సమస్యల పరిష్కారంపై పలు రూపాల్లో నిరసన తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారునితో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జేసీ జాహ్నవి ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమెతో పాటు డీఆర్వో సత్యనారాయణరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు, ఎస్‌డీసీ మనోరమ అర్జీలు స్వీకరించారు. మొత్తం 214 అర్జీలు వచ్చాయి. ప్రజలు అందజేసిన అర్జీలపై సంబంధిత జిల్లా అధికారులతో జేసీ మాట్లాడుతూ అర్జీలు తిరిగి ఓపెన్ కాకుండా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల కార్యాలయాల్లో ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయంపై గ్రామ స్థాయి సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

పస్తులతోనే పండగ చేసుకున్నాం..

ఆరు నెలలుగా బకాయి జీతాలు చెల్లించకపోవడంతో వెలుగు వీవోఏలు నిరాహార దీక్షకు దిగారు. కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. నెలల తరబడి గౌరవ వేతనం అందలేదని, ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని, సంక్రాంతి పండగ నాడు పస్తులున్నామని వాపోయారు. ఉపాధికి భద్రత కల్పిస్తూ మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయి వేతనాలు విడుదల చేయాలంటూ కలెక్టరేట్ హోరెత్తేలా నినాదాలు చేశారు. ఈ నెల 31 నాటికి సమస్యలు పరిష్కారం కాకపోతే వచ్చే నెల 1 నుంచి విధులకు గైర్హాజరై నిరసన కొనసాగిస్తామని తెలిపారు.

ఫీ'జులుం'పై ఆగ్రహం



ఫీజుల పేరుతో వేధిస్తున్న విద్యా సంస్థలపై చర్యలకు డిమాండ్ చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు

ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య వేదిక నాయకుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ ఫీజులు వసూలు పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని, మానసిక వేదనకు గురిచేయడం లాంటి చర్యల వలన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ కమిటీ వేసి ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ సమస్యపై టీడీపీ నాయకుడి నిరసన



నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకుడు బుద్ద శ్రీనివాసరావు

తన భూసమస్యను పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు బుద్ద శ్రీనివాసరావు కలెక్టరేట్ వద్ద పార్టీ కండువా వేసుకుని నిరసన తెలిపారు. సమస్య పరిష్కారంపై అధికారుల వద్దకు వెళ్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. సమస్యపై కలెక్టర్‌కు వివరించినా పట్టించుకోలేదని, తనకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని భీష్మించారు. ఇరవై ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్నా ఫలితం లేదని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

భూనిర్వాసితులకు న్యాయం చేయాలి



న్యాయం చేయాలని నిరసన తెలుపుతున్న విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులు

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూనిర్వాసితుల ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలంటు నక్కపల్లి మండలం చందనాడ పంచాయతీ తమ్మయ్యపేట, తుమ్మలపేట గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన తెలిపారు. ఇటీవల చేసిన సర్వే ప్రకారం భూములు, ఇళ్లు, ఇతర ఆస్తులకు న్యాయబద్ధంగా పరిహారం చెల్లించాలని, 18 ఏళ్లు నిండిన వారికి రూ.25 లక్షలు చెల్లించి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, ఎం.అప్పలరాజు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 32 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో 32 అర్జీలు వచ్చాయని అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ తెలిపారు. అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయని అదనపు ఎస్పీ తెలిపారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.వెంకన్న పాల్గొన్నారు.

బెల్టు షాపులపై ఫిర్యాదు



ఫిర్యాదు కాపీతో టీడీపీ నేతలు శ్రీనివాస్, రమణ

మాకవరపాలెం: గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన మద్యం పాలసీకి విరుద్ధంగా గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు చేస్తున్నారంటూ తామరం, జి.నగరం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కోసూరు శ్రీనివాస్, యర్రంశెట్టి రమణ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న నాలుగు మద్యం దుకాణాల ద్వారా నిత్యం బెల్టుషాపులకు మద్యం తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మాకవరపాలెం, రోలుగుంట మండలాల్లో జరుగుతున్న ఈ తతంగంపై నర్సీపట్నం ఎక్సైజ్ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ఎంఆర్‌పీకి అదనంగా బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 వసూలు చేస్తూ విక్రయాలు చేస్తున్నారన్నారు.

కూటమి పాలనలో ఆడపిల్లలకు రక్షణేది?

- యలమంచిలి ఘటనపై మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆవేదన



యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతోందని, అనేక అఘాయిత్యాలు మహిళలపై జరుగుతున్నాయని యలమంచిలి మాజీ ఎమ్మెల్యే యువీ రమణమూర్తిరాజు(కన్నబాబు) ఆరోపించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నెల రోజుల వ్యవధిలో యలమంచిలి నియోజకవర్గం ఏటికొప్పాక, యలమంచిలిలో ఇద్దరు బాలికలపై అఘాయిత్యం జరగడం తనను కలచివేసిందన్నారు. మహిళలకు, బాలికలకు భద్రత లేకుండా పోయిందన్నారు. యలమంచిలిలో తాజాగా హాకీ కోచ్ 8వ తరగతి చదువుతున్న ఒక బాలికపై అత్యాచారానికి పాల్పడ్డం చాలా దారుణమన్నారు. భవిష్యత్‌లో మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

హోం మంత్రి స్పందించాలి

పట్టణానికి చెందిన హాకీ కోచ్ మళ్ల రూపేష్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన వల్ల యలమంచిలిలో హాకీకి అప్రతిష్ఠత వస్తుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఈ సంఘటనపై ఆయన సోమవారం ఎంపీడీవో కార్యాలయంలోని తన చాంబర్‌లో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పక్కనే ఉన్న రాష్ట్ర హోంమంత్రి అనిత ఈ దారుణాలపై స్పందించాలని డిమాండ్ చేశారు. మైనర్లపై వారానికొక అఘాయిత్యం జరుగుతూ ఉంటే ప్రభుత్వం చేష్టలుదిగి చూస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏదైనా ఘటన జరిగితే ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా టీడీపీ నాయకులు పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని గుర్తు చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, సుంకర మరిణేశ్వర్రావు, గొర్లి వెంకట్, రాపేటి సంతోష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్



మీడియాతో మాట్లాడుతున్న సీఐటీయూ, విద్యార్థి సంఘాల నాయకులు

అత్యాచారర నిందితుడిని కఠినంగా శిక్షించాలి

యలమంచిలి రూరల్: పట్టణంలో 13 ఏళ్ల బాలికను అత్యాచారం చేసిన హాకీ కోచ్ రూపేష్‌ను పోలీసులు కఠినంగా శిక్షించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి సకాలంలో శిక్ష విధించాలని సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీటీఐయూ యలమంచిలి మండల కార్యదర్శి సీహెచ్.శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ స్థానిక విలేకర్లతో మాట్లాడారు. యలమంచిలి పట్టణానికి చెందిన బాలికను హాకీ కోచ్ అత్యాచారం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటువంటి సంఘటనలు రాష్ట్రంలో చాలా ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. యలమంచిలి మండలంలో 20 రోజుల వ్యవధిలో ఇద్దరు బాలికలపై ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. ఈ సంఘటనపై పక్క నియోజకవర్గానికి చెందిన హోం మంత్రి అనిత ఇంకా స్పందించకపోవడం దుర్మార్గమన్నారు.

గీత కులాల మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అనకాపల్లి : జిల్లాలో కల్లు గీత కులాల వారికి కేటాయించిన 15 మద్యం షాపులకు సోమవారం నోటిఫికేషన్ జారీ చేసినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ తెలిపారు. ఈమేరకు ఆయన మీడియాకు తెలియజేశారు. ఏపీ ప్రభుత్వం కల్లు గీత కులాల వారికి 10 శాతం షాపులను రిజర్వు చేస్తూ ప్రత్యేకమైన నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. జిల్లా కలెక్టర్ వారి ఆమోదంతో గెజిట్ నెంబర్: 01/2025 ద్వారా జిల్లాలో కల్లు గీత కులాలకు సంబంధించిన 15 మద్యం షాప్‌లకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. గౌడ్, గౌడ, శెట్టిబలిజ, యాత కల్లు గీత ఉపకులాలను గుర్తించి లాటరీ ద్వారా గౌడ్ వారికి ఒకటి, గౌడ వారికి ఒకటి, శెట్టిబలిజ వారికి 09, యాత వారికి 04 షాపులను కేటాయించారు. గీత కులాలవారు వారికి కేటాయించిన మద్యం దుకాణాల కోసం ఫిబ్రవరి నెల ఐదో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనకాపల్లి, చోడవరం, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం, గోలుగొండ, వి.మాడుగుల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి నెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు కుల ధృవీకరణ పత్రం జతపరచాలని, ఉప కులం కూడా తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. లేని పక్షంలో సంబంధిత తహసిల్దార్ నుంచి ఉపకుల ధృవీకరణ పత్రం జతపరచాలని తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీన అనకాపల్లి గుండాల జంక్షన్ ఎస్ఆర్ శంకరం మీటింగ్ కాంప్లెక్స్‌లో లాటరీ తీయనున్నట్టు ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ తెలియజేశారు.

కొండలదేవునిపాలెం వద్ద గ్రావెల్ దందా

- పేదల డీ పట్టా భూముల్లో తవ్వకాలు
- కూటమి ఒత్తిళ్లకు తలొగ్గిన రాంబిల్లి అధికారులు, పోలీసులు



గ్రావెల్ తవ్వకాలు చూపుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడునాయుడు

రాంబిల్లి(యలమంచిలి): కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని పేదలు సాగు చేసుకుంటున్న డీపట్టా భూముల్లో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లలో విచ్చలవిడిగా తరలిస్తున్నారు. రాంబిల్లి శివారు గ్రామం కొండలదేవునిపాలెం కొండ ప్రాంతంలో జీడి, మామిడి తోటలు వేసుకొని జీవనం సాగిస్తున్న పేదల డీపట్టా భూములపై వీరి కన్ను పడింది. ప్రభుత్వ వర్కుల పేరిట అక్కడ గ్రావెల్ తరలించుకుపోయి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు అక్కడకు వెళ్లి పరిశీలించి రాంబిల్లి పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా, ముందు రెవెన్యూ అధికారులకు చెప్పాలని సీఐ నుంచి సమాధానం రావడంతో విస్తుపోయారు. ఆ తర్వాత ఆర్ఐకు తెలియపరచగా, రాంబిల్లి జెడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వ వర్క్‌ల కోసం గ్రావెల్ తరలిస్తున్నట్టు సమాధానం ఇచ్చారు. నిత్యం రాంబిల్లి పోలీస్ స్టేషన్, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల ఎదురుగా గ్రావెల్ తరలిపోతున్నా సంబంధిత అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం.

ప్రభుత్వ వర్క్‌ల పేరిట గ్రావెల్ దందా

మండలంలో పలు అభివృద్ధి పనులు కోసం గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు తీసుకున్నామంటూ అధికార పార్టీకి చెందిన కొంత మంది నేతలు గ్రావెల్ దందాకు పాల్పడుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడునాయుడు ఆరోపించారు. కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

మద్యం తాగొద్దంటే..పురుగుమందు తాగాడు



మృతుడు అప్పారావు

కోటవురట్ల : మద్యం తాగొద్దని భార్య మందలించడంతో మనస్థాపం చెందిన ఓ రిక్షా కార్మికుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇవి. రాట్నాలపాలేనికి చెందిన బుంగా అప్పారావు(50) రిక్షా తొక్కి జీవనం సాగిస్తున్నాడు. వచ్చిన డబ్బులతో తరచూ మద్యం తాగుతుండడంతో భార్య బుంగా ఈరమ్మ ఆరోగ్యం చెడిపోతుందని మందలించింది. దాంతో మనస్థాపం చెందిన అప్పారావు సోమవారం ఉదయం 10 గంటల సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఈరమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

స్టాఫ్ నర్సుల ప్రొవిజినల్ జాబితా విడుదల

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీలో భాగంగా అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి విడుదల చేశారు. వెబ్‌సైట్ https://nagendrasvrt.wordpress.comలో స్టాఫ్ నర్సుల ప్రొవిజనల్ జాబితాను పొందుపరిచారు. ఈ జాబితాపై మూడు రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరణకు గడువు ఇచ్చారు. వాటిని పరిశీలించిన మెరిట్ లిస్టు విడుదల చేస్తామని వివరించారు. ఉత్తరాంధ్రలో 106 పోస్టులకు 8,300 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ఎ.కొత్తపల్లిలో దివ్యాంగ యువకుడి అదృశ్యం



అప్పలనాయుడు (ఫైల్)

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లికి చెందిన దివ్యాంగుడు కర్రి మాతా అప్పలనాయుడు(32) అదృశ్యమయ్యాడు. ఈ మేరకు అప్పలనాయుడు సోదరుడు నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు. అప్పలనాయుడు 2017లో జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయాడు. అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయినా తిరిగి వచ్చేవాడని, గత నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిన తన అన్నయ్య తిరిగి రాలేదని నూకరాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, సదరు వ్యక్తి ఆచూకీ లభిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

బైకు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



నారాయణరావు (ఫైల్)

మాకవరపాలెం : బైక్ ప్రమాదంలో గాయపడిన ఆటో యూనియన్ అధ్యక్షుడు కోసూరు నారాయణరావు (55) మృతి చెందారు. మండలంలోని తామరం గ్రామానికి చెందిన నారాయణరావు ఈ నెల 22న ఈ గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొట్టుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి విశాఖలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నారాయణరావు మృతికి వైఎస్సార్‌సీపీ నేతలు, గ్రామస్తులతోపాటు ఆటో కార్మికులు సంతాపం తెలియజేశారు. నారాయణరావు తామరం గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా, మండల క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అలాగే ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, నర్సీపట్నం డివిజన్ కన్వీనర్ వరహాలబాబు సంతాపం తెలియజేశారు. నారాయణరావు మృతి ఆటో కార్మికులకు తీరనిలోటన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేత విశాఖ



రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి బహుమతి అందుకుంటున్న విశాఖ జిల్లా మహిళా జట్టు



రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి బహుమతి అందుకుంటున్న విశాఖ జిల్లా పురుషుల జట్టు

చోడవరం : మూడు రోజుల పాటు ఉత్కంఠగా జరిగిన రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. పురుషులు, మహిళలు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి ఒక్కో విభాగం నుంచి 13 జట్లు చొప్పున పాల్గొన్నాయి. చోడవరం మండలం అంకుపాలెంలో ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. మహిళల కబడ్డీ పోటీల్లో విశాఖ జట్టు మొదటి బహుమతి, విజయనగరం జిల్లా రెండో బహుమతి, మూడో స్థానంలో కర్నూలు, చిత్తూరు జిల్లా జట్లు నిలిచాయి. పురుషుల విభాగంలో విశాఖ జిల్లా జట్టు మొదటి స్థానం, రెండో స్థానంలో చిత్తూరు, మూడో స్థానంలో కర్నూలు, కృష్ణా జిల్లాల జట్లు నిలిచాయి. విజేతలకు ట్రోఫీలు అందజేశారు. వీరిలో జాతీయస్థాయి పోటీలకు ఆంధ్రా నుంచి ఆడేందుకు ఒక జట్టును ఎంపిక చేసినట్టు అసోసియేషన్ తెలిపింది. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు , సీఈఓ వీరలంకయ్య, కార్యదర్శి పద్మజబాల పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి.

నేవీ గేట్ వద్ద రెండు లారీలు ఢీ

- సెక్యూరిటీ గార్డు మృతి
- మృతుడు ఒడిశాకు చెందిన వ్యక్తిగా గుర్తించిన పోలీసులు

రాంబిల్లి (యలమంచిలి) : రాంబిల్లి నేవల్‌బేస్ ప్రాజెక్ట్‌లో సోమవారం ఉదయం రెండు లారీలు ఢీ కొట్టుకున్న ప్రమాదంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఒక సెక్యురిటీ గార్డు మృతి చెందినట్టు రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. వివరాలివి. మండలంలో నేవల్‌బేస్ ప్రాజెక్ట్‌లో సోమవారం రెండు లారీలు ఢీకొన్నాయి.

ఈ ప్రమాదంలో గేట్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ జిల్లా, కేదార్‌పూర్ గ్రామానికి చెందిన ప్రహ్లాద్ పాణిగ్రహి (29)తీవ్రగాయాల పాలవ్వగా తాను పనిచేస్తున్న సంస్థ వారు అతనిని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. దీంతో మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా మృతుడు ప్రహ్లాద్ పాణిగ్రహి కొన్నేళ్లుగా నేవల్‌బేస్ ప్రాజెక్ట్‌లో సెక్యురిటీ గార్డుగా ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. 6 నెలల క్రితమే అతనికి వివాహం జరిగినట్టు తోటి కార్మికులు తెలిపారని, మృతుడి కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడు నాయుడు డిమాండ్ చేశారు. కంపెనీలో భద్రతా ప్రమాణాలు పాటించక ఎంతో మంది వలస కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి భద్రతా ప్రమాణాలు పాటించని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

టూరిజంలో ఉమ్మడి విశాఖలో విస్తృత అవకాశాలు

- పెట్టుబడిదారులకు వివరించిన మూడు జిల్లాల కలెక్టర్లు

సాక్షి, విశాఖపట్నం : పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాలో విస్తృతమైన అవకాశాలు, వనరులు ఉన్నాయని ఆయా జిల్లాల కలెక్టర్లు స్పష్టం చేశారు. నగరంలో నిర్వహించిన టూరిజం రీజనల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను టూరిజం మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీతో పాటు కలెక్టర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లాలో ఉన్న టూరిజం అవకాశాలపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఇన్వెస్టర్లతో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అరకులో త్వరలోనే సీప్లేన్ ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ అరకు మొదలుకొని లంబసింగి, మారేడుమిల్లి వరకు సహజ ప్రకృతి సౌందర్య ప్రదేశాలన్నింటిని కలిపి సర్క్యూట్‌గా చేస్తే పర్యాటకులను ఆకర్షించవచ్చన్నారు. ఈనెల 31 నుంచి జరిగే అరకు చలి ఉత్సవ్‌లో ఈ ప్రాంతంలోని కల్చర్‌ను, పర్యాటకంగా అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరిస్తామని తెలిపారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలోని తంతడి, సీతపాలెంలో బీచ్ ఫ్రంట్ టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.. స్థానికంగా 80 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ పర్యాటకులకు అవసరమైన రిసార్ట్‌లు, మౌలిక వసతులు లేవన్నారు.

క్లుప్తంగా

60 మంది రోగులకు కంటి పరీక్షలు

కశింకోట: స్థానిక గవరపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెంటకోట నూకరాజు జ్ఞాపకార్థంగా కుమారులు లక్ష్మణ రావు, కొండలరావుల సహకారంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో అనకాపల్లికి చెందిన భువనేశ్వరి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది 60 మంది రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లద్దాలను రాయితీపై అందించారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి సిఫార్స్ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశువులు వ్యాధుల బారిన పడకుండా చర్యలు


రైతుకు మందులు అందిస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు, వైద్యుడు అనిల్‌కుమార్

అనకాపల్లి: పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గవరపాలెం పశువైద్యాధికారి సీహెచ్.అనిల్ కుమార్ తెలిపారు. తుమ్మపాల రైతు సేవా కేంద్రంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువులు వ్యాధులు బారిన పడినట్లయితే పాలు శాతం తగ్గుతుందన్నారు. ప్రభుత్వం ద్వారా పశువులకు కావలసిన వ్యాధి నిరోధక మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారన్నారు. అనంతరం రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను, 36 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించుట, 43 పశువులకు పశు ఆరోగ్య పరీక్షలు వంటి కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి సన్యాసినాయుడు, ఎంపీటీసీలు చదరం నాగేశ్వరరావు, పంచదారల కన్నారావు, రైతులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు..

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం ఉల్లి, టమాటా ధరలు యథావిధిగానే ఉన్నాయి. మిగిలిన కూరగాయల ధరలు మాత్రం బెట్టు మీద అమ్మకాలు సాగాయి. కిలో టమాటా రూ.20, బంగాళ దుంప, ఉల్లి రూ.40, బీట్రూట్, క్యారెట్, చామదుంప రూ.60, బెండకాయ, వంకాయ, బీరకాయ, దొండకాయ, చిక్కుడుకాయ, బరబాటి రూ.80కి అమ్మకాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 15,776 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,130	4,890
మొదటి రకం	3,450	4,090
రెండో రకం	2,950	3,710
మూడోరకం	2,770	3,170

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	:సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజ్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
హంగ్ కాంగ్ వారియర్స్	:వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	:శ్రీసత్య
ఐడెంటీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు , బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 369 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

- అసంపూర్తిగా లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్
- రైల్వే పరిధిలో పిల్లర్ల వంతెన పూర్తి
- ఆర్అండ్‌బీ పరిధిలో ప్రారంభం కాని పనులు
- 20 ఏళ్లుగా పూర్తికాని బ్రిడ్జి
- **వాహనచోదకులకు తప్పని కష్టాలు**

జాప్యమేల?


లక్ష్మీదేవిపేటలో రైల్వే స్టేషన్‌లో నిర్మించిన ఫ్లైఓవర్


రాష్ట్ర ప్రభుత్వ స్థలంలో రైల్వే అధికారులు వేసిన పిల్లర్

అనకాపల్లి: ప్రభుత్వాలు మారుతున్నా పట్టణ వాసులకు, ఇతర ప్రాంతాల వాహనదారులకు లక్ష్మీదేవిపేట రైల్వే గేటు వద్ద కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. రైల్వే పరిధిలో పిల్లర్ల వంతెన పూర్తి కాగా, ఆర్అండ్‌బీ పరిధిలో బ్రిడ్జి నిర్మించకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది.

2005లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో పట్టణంలో ప్రధానమైన మూడు ఫ్లైఓవర్ **బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు పట్టణంలో శారదానది, మండలంలో ఏఎంఏఎల్ కళాశాల వద్ద రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, లక్ష్మీదేవిపే**టలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. శారదానది, ఏఎంఏఎల్ కళాశాల బ్రిడ్జిలు శరవేగంగా నిర్మించారు. అయితే తొలుత రైల్వే అధికారులు జాప్యం, స్థానికుల నుంచి సహకారం కొరవడంతో లక్ష్మీదేవిపేట బ్రిడ్జి నిర్మాణం ఆలస్యమైంది. ఆ తర్వాత ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో రైల్వే పరిధిలో సంబంధిత అధికారులు రూ.6 కోట్లతో పిల్లర్లు వేసి పట్టాలపై వంతెన ఏర్పాటు చేశారు. దీనికి ఇరువైపులా సమాంతరంగా బ్రిడ్జి ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు అప్పటి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. మిగిలిన పనులు రూ.8 కోట్లతో పూర్తి చేయాల్సి ఉండగా, 20 సంవత్సరాలుగా చేయకపోవడంతో వాహనదారులు, పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లక్ష్మీదేవిపేట రైల్వే గేటుతో ఇబ్బందులు...

జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత అనకాపల్లి పట్టణానికి ఎంతో ప్రాముఖ్యత కలిగింది. స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి ద్వారా అనకాపల్లి నుంచి చోడవరం, మాడుగుల, బుచ్చెయ్యపేట మండలాలతో పాటు అల్లూరు సీతారామరాజు జిల్లాకు వెళ్లే సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోయిన సమయంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంటోంది. ఇటుగా భారీ వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో పక్కనే రైల్వే స్టేషన్ వద్ద లక్ష్మీదేవిపేట రైల్వే **గేటు మీదుగా మళ్లించేవారు.** ఈ సమస్యకు శాశ్వత **పరిష్కారం చూపాలని లక్ష్మీదేవి**పేట రైల్వే గేటు, అన**కాపల్లి రైల్వే స్టేషన్‌కు మధ్యలో** ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించడానికి అధికారులు పూనుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేటి వరకూ పనులు పూర్తి చేయలేదు. రైల్వే పరిధిలో నిర్మించిన బ్రిడ్జి నిరుపయోగంగా ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

20 సంవత్సరాల క్రితం లక్ష్మీదేవిపేట రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అప్పటి జనాభా, వాహనదారుల దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టారు. అప్పట్లో, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొణతాల రామకృష్ణ ఉండటంతో వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


లక్ష్మీదేవిపేటలో రైల్వే స్థలంలో నిర్మించిన పిల్లర్లు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించినట్లయితే పేట ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అనకాపల్లి-విశాఖ వెళ్లే రైళ్ల నిత్యం రాకపోకలు సాగించే సమయంలో లక్ష్మీదేవిపేట రైల్వే గేటు వేయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

– ఆర్.శివప్రసాద్, లక్ష్మీదేవిపేట, అనకాపల్లి

బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు



గ్రామీణ ప్రాంతాల నుంచి అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చే సమయంలో లక్ష్మీదేవిపేట గేటు వేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు పడుతున్న సమయంలో సమస్య ఎక్కువగా ఉంటోంది. రైల్వే స్థలంలో ఫ్లైఓవర్‌ను సంబంధిత అధికారులు నిర్మించగా, రాష్ట్ర ప్రభుత్వం మిగతా భాగం పూర్తి చేయలేదు.

– కె.కన్నబాబు, అనకాపల్లి

31న వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం

కశింకోట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఈ నెల 31న ఉదయం 10 గంటలకు కశింకోటలోని సరోజిని విల్లా వేదికగా జరగనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు పాల్గొంటారన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్ పిలుపు మేరకు మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గత ప్రభుత్వంలో వివిధ హోదాల్లో నామినేటెడ్ పదవులు నిర్వహించిన వారు, పార్టీ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు, పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

సైబర్ మోసాలపై అవగాహన


సైబర్ మోసాలపై అవగాహన కలిగిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: మండలంలోని చింతలపాలెంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సాయిబాబా తీర్థ మహోత్సవంలో ఆన్‌లైన్‌లో సైబర్, ఆర్థిక మోసాలపై సీఐ అల్లు స్వామినాయుడు ప్రజలకు అవగాహన కల్పించారు. ఏ విధంగా బ్యాంకు అక్కౌంట్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా నగదు తస్కరిస్తున్నారో వివరించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. దీని వల్ల విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. మాదకద్రవ్యాల నేరాలు పాల్పడిన వారికి కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక మోసాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వీడియో, ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శన నిర్వహించి అవగాహన కలిగించారు.

జిల్లా పరిషత్ ఆస్తుల సంరక్షణకు చర్యలు

పెందుర్తి: జిల్లా పరిషత్‌కు చెందిన స్థలాలు, ఇతర ఆస్తులను అక్రమార్కుల చెర నుంచి కాపాడేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను సూచించారు. జీవీఎంసీ 95వ వార్డు పరిధి పురుషోత్తపురంలోని జిల్లా పరిషత్‌కు చెందిన స్థలాన్ని జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఇతర అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ ఎక్కడైనా జెడ్పీ ఆస్తులు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ జెడ్పీ, మండల పరిషత్ స్థలాల రక్షణ బాధ్యత స్థానిక అధికారులు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో కొల్లి వెంకట్రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


పురుషోత్తపురంలోని జెడ్పీ స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో నారాయణమూర్తి

భూ ఆక్రమణలను సహించబోం

- ఆర్డీవో శ్రీలేఖ హెచ్చరిక

పెందుర్తి: ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో పి.శ్రీలేఖ హెచ్చరించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఒకే ఫిర్యాదు మళ్లీ మళ్లీ వస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. పలు సమస్యలపై 4 ఫిర్యాదులు వచ్చాయి. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


వినతులు పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీలేఖ

గోవాడకు జోరుగా చెరకు తరలింపు


చెరకును తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

కె.కోటపాడు : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభం కావడంతో సాగులో ఉన్న చెరకు పంటను తరలించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఫ్యాక్టరీలోని సభ్య రైతులకు ఫీల్డ్ సిబ్బంది కటింగ్ ఆర్డర్లను ఇప్పటికే మంజూరు చేస్తున్నారు. ఈ మేరకు సాగులో ఉన్న చెరకు పంటను ఫ్యాక్టరీకి తరలించే పనులను రైతులు జోరుగా చేపడుతున్నారు. ఈ ఏడాది గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ప్రస్తుతం క్రషింగ్ ప్రారంభం కావడంతో మద్దతు ధర రైతులు ఆశించనంత మేరకు లేకపోయినా తప్పనిసరి పరిస్థితిలో చెరకును ఫ్యాక్టరీకి తరలించే చర్యలు చేపడుతున్నారు. మరో వైపు కూలీలకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. చెరకు సాగుకు పెట్టుబడి పెరిగిన దృష్ట్యా ఫ్యాక్టరీ యాజమాన్యం మద్దతు ధరను పెంచాలని పలువురు రైతులు కోరుతున్నారు.


బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

యలమంచిలి రూరల్: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని బాలల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రతినిధి డి. లోవరాజు తెలిపారు. సోమవారం ఏటికొప్పాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, లైంగిక దాడులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలంతా చదువుకోవాలన్నారు. బాలికల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేశాయన్నారు. లింగ వివక్ష చూపితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. హెచ్ఎం సూర్యనారాయణ, సూపర్ వైజరు సుహాసిని, ఏఎన్ఎంలు జ్యోతి, పి. కుమారి, ఆరోగ్య సిబ్బంది కృష్ణవేణి, అమ్మాజీ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రతినిధి లోవరాజు

పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

రాంబిల్లి (యలమంచిలి): పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో అప్పారావు అన్నారు. రాంబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధమవ్వాలో పలు సూచనలు సలహాలు అందించారు. ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమై పాఠశాలలో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో సూర్యారావు, హెచ్ఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

కశింకోట హైవేపై వాహనాల తనిఖీ


హైవేపై వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

కశింకోట: స్థానిక కూడలిలోని జాతీయ రహదారిపై ఎస్ఐలు మనోజ్‌కుమార్, లక్ష్మణరావు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు, కార్లను తనిఖీ చేశారు. వాటి రికార్డులు పరిశీలించారు. సక్రమంగా లేని వాహనదారులకు జరిమానా విధిస్తూ సెల్‌ఫోన్ సమాచారం ఇచ్చారు. ఇది చెల్లించే వరకు వాహనం ఇవ్వబోమని హెచ్చరించారు. దీంతో వాహన చోదకులు అవాక్కయ్యారు.

10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న ఆటో, ఆర్టీసీ హైర్ బస్సు ఢీకొన్నాయి. దీంతో ఆటో బోల్తాపడి దానిలో ప్రయాణిస్తున్న పది మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆటో, బస్సుకు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ విషయమై తమకు ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం: టైలరింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ(నాక్) ఏడీ రవికుమార్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని నాక్ శిక్షణ కేంద్రంలో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఏడు, ఆపై చదువుకున్న మహిళలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 77802 75922 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి


రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రమాణం చేస్తున్న విద్యార్థులు

కశింకోట: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. స్కూలు విద్యార్థులు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. రోడ్డు నిబంధనలు పాటిస్తామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఎస్ఐ పి. మనోజ్‌కుమార్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాజన్న, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ. గీతకావ్య, స్కూలు డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, హైవే సేఫ్టీ టోల్ మేనేజర్ డి.ఎ.కృష్ణ, సేఫ్టీ మేనేజర్ అశోక్‌కుమార్, సేఫ్టీ ఆఫీసర్ అజయ్‌కుమార్, ఐఎంటీ మేనేజర్ కె. సత్యనారాయణ, ఐఎంటీ ఆఫీసర్ ఎ. ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురిపై కేసు

మాకవరపాలెం: రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పైడిపాల దళిత వాడకు చెందిన కసిపల్లి యేసురత్నం డ్వాక్రా రుణ వాయిదా చెల్లించలేదు. దీంతో గ్రూపు సభ్యులు ఆదివారం సాయంత్రం వెంటనే వాయిదా నగదు చెల్లించాలని అడిగారు. ఇదే విషయమై ఈ కాలనీలో ఉన్న పురం లోవరాజు(37) నగదు సకాలంలో చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించడంతోపాటు దుర్భాషలాడాడు. ఈ విషయాన్ని మహిళ ఇంటికివెళ్లి తన కుమారులు శివాజీ, అభిలకు తెలియజేసింది. దీంతో ఈ ఇద్దరు లోవరాజుపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అలాగే లోవరాజు చేసిన దాడిలో శివాజీ(24), అభి(21)లకు గాయాలు కావడంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. లోవరాజును చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించామన్నారు.

31న జాబ్ మేళా

దేవరాపల్లి: దేవరాపల్లిలో ఈ నెల 31న జాబ్ మేళా జరగనుంది. జాబ్ మేళా ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాబ్ మేళా నిర్వహించేందుకు స్థానిక హైస్కూల్ హెచ్ఎం, మండల విద్యాశాఖ అధికారి-1 బి.పడాల్‌దాస్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తితో కలిసి చర్చించారు.

కవలలకు తులాభారం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం భీమడోలు ప్రాంతానికి చెందిన కవల పిల్లలకు తులాభారం క్రింద పటికబెల్లంను తల్లిదండ్రులు సమర్పించారు. ఉదయం సింహగిరికి కవలలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు ఆలయ ప్రాంగణంలో ఉన్న త్రాసులో ఆ పిల్లలను ఉంచి తులాభారం వేశారు. వారి బరువు 15 కిలోలు ఉండటంతో దానికి సరిపడా పటిక బెల్లం సమర్పించారు. కవలలను తులాభారం వేసేటప్పుడు పలువురు భక్తులు ఆసక్తిగా తిలకించారు.


కవల పిల్లలకు తులాభారం వేస్తున్న తల్లిదండ్రులు

బెల్టు షాపుల కారణంగా పెరిగిన అత్యాచారాలు

దేవరాపల్లి: గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులను ఏర్పాటు చేయడంతోనే మహిళలు, బాలికలపై అత్యాచారాలు, దాడులు అధికమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. ఈ మేరకు మండల కేంద్రం దేవరాపల్లిలో సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి పాన్ షాపు, టీ దుకాణాల్లో సైతం మద్యం అన్ని వేళల్లో అందుబాటులో ఉంటుందన్నారు. బాలురు సైతం మద్యం సేవించి ఆ మత్తులో అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యలమంచిలి మండలంలో 20 రోజుల వ్యవధిలో ఇద్దరు బాలికలపై అత్యాచారాలు జరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. బెల్టు షాపులను అరికట్టాల్సిన అధికారులు మామ్ముళ్ల మత్తులో నిద్ర పోతున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కూటమి నాయకులే దగ్గరుండి కోళ్ల పందెం, పేకాటను ఆడిస్తున్నారని, ఇలాంటి వ్యవస్థలో మహిళలు, బాలికలకు రక్షణ ఎలా కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇంతటి దౌర్భాగ్యపు పరిస్థితి మునుపెన్నడూ లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో బెల్టు షాపులను నివారించాలని వెంకన్న డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకన్న